andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.6। కనిష్ఠం 16.5



నిర్మల్
జిల్లా వార్తలు

8

శనివారం 6 జనవరి 2024

మున్సిపల్ కార్మికుల ఆందోళనకు కౌన్సిలర్ల మద్దతు



నిర్మల్ కల్చరల్, జనవరి 5 : నిర్మల్ మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు సమస్యలపై చేపట్టిన ధర్నా శుక్రవారం మూడో రోజుకు చేరింది. కౌన్సిలర్లు అయ్యన్నగారి రాజేందర్, ఎస్. పోశెట్టి, నాయకులు తారక రఘువీర్, మేడారపు ప్రదీప్, తదితరులు మద్దతు తెలిపారు. వారి సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు.



కదలరు వదలరు

- ఏళ్ల నుంచి ఒకే చోట తిష్ట వేసిన అధికారులు
- జిల్లా రవాణా శాఖలో విచిత్ర పరిస్థితి
- అక్రమాల ఆరోపణలపై విజిలెన్స్ నివేదికలు బుట్టదాఖలు
- రాజకీయ పలుకుబడితో అంతా తారుమారు
- కొత్త సర్కారు హయాంలోనైనా కదలిక వచ్చేనా!?
- ఎమ్మెల్యేకు సైతం ఫిర్యాదుల వెల్లువ



నిర్మల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలు కీలకశాఖల్లో కొంతమంది అధికారులు ఏళ్ల నుంచి కదలకుండా.. వదలకుండా ఆ పోస్టుల్లోనే కొనసాగుతుండడం విమర్శలకు తావిస్తోంది. ముఖ్యంగా సర్కారుకు భారీగా ఆదాయాన్ని సమకూర్చే రవాణాశాఖలో గత తొమ్మిది సంవత్సరాల నుంచి ఇలాంటి పరిస్థితి ఉండడం చర్చకు తావిస్తోంది. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న జిల్లా రవాణాశాఖ అధికారి దాదాపు తొమ్మిది సంవత్సరాల నుంచి ఇక్కడే కొనసాగుతుండడం పట్ల భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సదరు అధికారికి బలమైన రాజకీయ అండదండలు ఉండడం అలాగే సంబంధిత శాఖలో గట్టి పట్టు ఉన్న కారణంగా ఆయనను ఇప్పటి వరకు ఎవరు కూడా బదిలీ చేసేందుకు సహసించడం లేదంటున్నారు. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ పెద్దల అండదండలు సంబంధిత అధికారికి పుష్కలంగా ఉన్న కారణంగా జిల్లా రవాణాశాఖలో ఆ అధికారి చెప్పిందే వేదంగా కొనసాగిందంటున్నారు. అయితే గత కొన్ని సంవత్సరాల నుంచి జిల్లా రవాణాశాఖలో ఇష్టారాజ్యంగా కొనసాగుతుందంటూ, అవినీతి అక్రమాలు జరుగుతున్నాయంటూ ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. కొంతమంది బాధితులు రవాణాశాఖ విజిలెన్స్ విభాగానికి కూడా సంబంధిత అధికారిపై స్వయంగా ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన రవాణాశాఖ ఉన్నతాధికారులు విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. అయితే విజిలెన్స్ దాదాపు ఈ విజిలెన్స్ విచారణపై కూడా సంబంధిత అధికారి ప్రభావం చూపాడన్న ఆరోపణలున్నాయి. దాదాపు ఐదారునెలలు గడుస్తున్నప్పటికీ విజిలెన్స్ విచారణకు సంబంధించి నివేదికలు గాని అలాగే ఆ నివేదికలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారోననే అంశంపై గాని స్పష్టమైన వివరణలు వెల్లడికాకపోవడం అనుమానాలకు తావిస్తోందంటున్నారు. జిల్లా రవాణాశాఖపై అనేక ఆరోపణలు, విమర్శలు ఉన్నప్పటికీ ఆ దిశగా ఎవరు కూడా చర్యలు చేపట్టకపోవడం ఏమిటంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. పలుశాఖల్లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బందిపై వచ్చే చిన్నపాటి ఆరోపణలకే చర్యలు తీసుకుంటుండగా రవాణాశాఖలో మాత్రం చర్యల కోసం ఏ ఒక్క అధికారి సాహసించకపోతుండడం పలు సందేహాలకు ఆస్కారమిస్తోందంటున్నారు. అయితే కీలకమైన విజిలెన్స్ నివేదిక వెల్లడికాకపోవడం వెనక కూడా బలమైన ఒత్తిళ్లు ఉన్నాయంటున్నారు. బీఆర్ఎస్ పార్టీ హయాంలో దాదాపు తొమ్మిది సంవత్సరాల పాటుగా ఆ అధికారి ఇష్టారాజ్యంగా వ్యవహరించడంపై ఆ శాఖలోనే చర్చకు జరుగుతోందని అంటున్నారు. కొద్దిరోజుల క్రితం ఇదే శాఖలో పనిచేసిన ఓ ఉన్నతాధికారి కారణంగా కూడా రవాణాశాఖ విమర్శల పాలైన సంగతి తెలిసిందే. సదరు అధికారి తన ఉద్యోగానికి రాజీనామా చేసి ఆసిఫాబాద్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆ వ్యవహారంపై రవాణాశాఖలో ఇంకా చర్చ జరుగుతుండగానే ప్రస్తుతం సంబంధిత అధికారిపై కూడా రాజకీయ పరమైన చర్చనే జరుగుతున్నట్లు ఫిర్యాదులున్నాయి. అయితే బీఆర్ఎస్ సర్కారు హయాంలో ఇష్టారాజ్యంగా వ్యవహరించిన సదరు అధికారి తీరుపై ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ పెద్దలు సైతం తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు సమాచారం. జిల్లాకు చెందిన పలువురు కాంగ్రెస్ నేతలు సంబంధిత అధికారిపై ఇప్పటికే ఫిర్యాదు చేసి విజిలెన్స్ నివేదికపై విచారణ జరపాలని అలాగే ఆ అధికారిని బదిలీ చేయాలని కోరినట్లు విశ్వసనీయ సమాచారం. ఇటీవల జిల్లాకు చెందిన కొంతమంది నాయకులు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను సైతం కలిసి ఈ అధికారిపై విచారణ జరపాలంటూ కోరినట్లు సమాచారం. దీంతో పాటు స్థానిక బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డికి కూడా సంబంధిత అధికారి వ్యవహారశైలిపై అలాగే వెల్లువెత్తిన ఆరోపణలపై ఫిర్యాదులు చేసినట్లు తెలిసింది. ఎమ్మెల్యే సైతం సంబంధిత అధికారిపై విచారణ జరిపించేందుకు ఆ శాఖ ఉన్నతాధికారులకు లేఖ రాయనున్నట్లు సమాచారం.

విజిలెన్స్ విచారణపై చర్యలు కరువు

జిల్లా రవాణా శాఖలో జరిగిన అవకతవకలపైనా, సంబంధితశాఖ అధికారిపైనా ఫిర్యాదుల మేరకు రాష్ట్ర రవాణాశాఖ విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. ఈ విచారణను సంబంధిత శాఖ ఉన్నతాధికారికి అప్పజెప్పింది. అయితే ఈ విచారణపై ఇప్పటి వరకు స్పష్టమైన సమాచారం వెల్లడికాలేదంటున్నారు. ఒకవేళ విచారణ పూర్తయ్యి నివేదికలు సమర్పించిన ఆ నివేదికలు బయటకు రాకపోవడం వెనక అంతర్యమేంటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అయితే సదరు అధికారి తనకున్న పలుకుబడి, పరపతితో ఈ విజిలెన్స్ నివేదిక బయటకు వెల్లడికాకుండా చూశారన్న ఆరోపణలున్నాయి. కొత్త ప్రభుత్వంలోనైనా ఆ విజిలెన్స్ నివేదికపై ఎలాంటి చర్యలు జరుగుతాయోనన్న ఆసక్తి అంతా నెలకొందంటున్నారు. ప్రస్తుతం తాజాగా ఈ అంశం జిల్లా రవాణా శాఖలో మరోసారి చర్చనీయాంశమవుతోంది.

సర్కారుకు ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ నేతలు

ఇదిలా ఉండగా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏకపక్షంగా వ్యవహరించి ఆ పార్టీ ప్రజా ప్రతినిధులు, నేతలకు సన్నిహితంగా మెలిగిన సదరు అధికారిపై కాంగ్రెస్ పార్టీ నేతలు గుర్రుగా ఉన్నట్లు చెబుతున్నారు. అప్పట్లో బీఆర్ఎస్‌ను మినహా ఏ ఒక్క రాజకీయ పార్టీ నేతలతో పాటు ఏ ఒక్కరిని కూడా ఖాతరు చేయకుండా వ్యవహరించారన్న విమర్శలున్నాయి. దీని కారణంగానే జిల్లాకు చెందిన పలువురు కాంగ్రెస్ నేతలు ఇప్పటికే రవాణాశాఖ మంత్రి దృష్టికి అలాగే సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి అధికారి వ్యవహార శైలిని తీసుకువెళ్లారంటున్నారు. సంబంధిత అధికారిపై గతంలో జరిగిన విజిలెన్స్ విచారణ నివేదికలను వెల్లడి చేయాలని తగిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నేతలు కోరినట్లు చెబుతున్నారు.

ఎమ్మెల్యేకు ఫిర్యాదు

కాగా బీజేపీ పార్టీకి చెందిన కొంతమంది నేతలు ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డికి రవాణాశాఖ అధికారి తీరుపై ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ ఫిర్యాదును సీరియస్‌గా తీసుకుంటున్న ఎమ్మెల్యే సంబంధిత శాఖ ద్వారా విచారణ జరిపించేందుకు సిద్ధమవుతున్నారన్న ప్రచారం జరుగుతోంది. ఒకేచోట దాదాపు తొమ్మిది సంవత్సరాల పాటు నిరాటకంగా విధులు నిర్వహించడం పట్ల ఎమ్మెల్యే సైతం ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారంటున్నారు. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ పెద్దల అండదండలతోనే ఇది సాధ్యమైందంటూ పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారంటున్నారు. మొత్తానికి ఓ వైపు కాంగ్రెస్ నేతలు మరోవైపు స్థానిక ఎమ్మెల్యే సదరు అధికారి తీరుపై ఆగ్రహంతో ఉండడం ఆ అధికారిపై వెల్లువెత్తిన ఆరోపణల అంశాన్ని సీరియస్‌గా పరిగణిస్తుండడం ప్రస్తుతం అంతటా చర్చకు తావిస్తోంది.



కొత్తగా వచ్చిన ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

నూతన ఎస్పీకి శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు

నిర్మల్ కల్చరల్, జన వరి 5 : జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ జానకి షర్మిలను జడ్పీటీసీ పత్తి రెడ్డి రాజేశ్వర్‌రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్పీని కలిసిన వారిలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సారంగాపూర్ దశరథ్ రాజేశ్వర్, సాగర్‌రెడ్డి, కట్కం రాజారెడ్డి ఉన్నారు.

ఓలాలో ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన



కుంటాల, జనవరి, 5 : కుంటాల మండలంలోని ఓలా గ్రామంలో వీరాంజనేయ, శివ, గణేష, పార్వతి నంది సహిత శ్రీ ఇప్పల ఎల్లమ్మ, రేణుకా పరుశురామ, పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలను శుక్రవారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. 3వ తేది బుధవారం ప్రారంభమైన ఈ ఉత్సవాలు నేటితో ముగిశాయి. ఆఖరి రోజు శుక్రవారం నిర్వహించిన ఉత్సవాలలో ఎమ్మెల్యే రామారావు పటేల్ పూజలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం 5 గంటలకు స్వస్తి వచనము, దేవతారాధన, హోమము, గర్త సంస్కారము, యంత్ర మూర్తి స్థాపన, ఆరాధన, ప్రాణ ప్రతిష్ఠ, ద్రుగ్‌బలి, పుర్ణాహుతి, దేవతా విసర్జన, ప్రోక్షణ భక్తులకు అన్నదాన అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

లింబా (బీ)లో ఘనంగా అయ్యప్ప పడిపూజ

కుంటాల, జనవరి, 5 : కుంటాల మండలంలోని లింబా (బీ) గ్రామంలో శుక్రవారం అయ్యప్ప పడిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన అయ్యప్ప స్వాములు ప్రదీప్, మల్లేష్, గంగాదర్, అరవింద్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇట్టి సామూహిక పడిపూజ కార్యక్రమంలో మండలంలోని పలు గ్రామాల నుంచి అయ్యప్పస్వాములు అధిక సంఖ్యలో హాజరయ్యారు. పడిపూజ కార్యక్రమంలో స్వాములు గణపతి, సుబ్రహ్మణ్యస్వామి, అయ్యప్పకు అభిషేకం, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ పాల్గొన్నారు.

20, 21న ఓటరు నమోదుపై స్పెషల్ డ్రైవ్ : ఆర్డీవో

నిర్మల్ కల్చరల్, జనవరి 5 : ఈ నెల 20, 21న ఓటర్ల నమోదుపై ప్రత్యేకడ్రైవ్ నిర్వహిస్తున్నామని ఆర్డీవో రత్న కళ్యాణి తెలిపారు. శుక్రవారం రాబోయే పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు 9,012 కొత్త ఓటర్లు నమోదయ్యారన్నారు. పోలింగ్ బూత్ ఆఫీసర్ల ఆధ్వర్యంలో ఓటరు నమోదు ప్రక్రియ కొనసాగిస్తున్నట్లు చెప్పారు. నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీవో

చట్టాన్ని అతిక్రమించొద్దు : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్పీ

నిర్మల్ కల్చరల్, జనవరి 5 : దిలావర్‌పూర్‌లో ఇథనాల్ పరిశ్రమ నిర్మాణ విషయంలో ప్రజలు ఆందోళన చెందవద్దని, సమస్య ను సామసర్యంగా పరిష్కరిస్తామని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ హామీ ఇచ్చారు. శుక్రవారం గ్రామస్తులు క లెక్టర్‌ను కలిసి సమస్య వివరించారు. ఈ సంద ర్భంగా చట్టాన్ని అతిక్రమించరాదన్నారు. అధికారులతో చర్చించి అపోహలు తొలగిస్తామని వారితో చర్చిస్తామన్నారు. చట్టానికి వ్యతిరేకంగా ఎలాంటి సంఘటనలకు పాల్పడవద్దని సూచించారు. అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన నూతన ఎస్పీ

జిల్లా నూతన బాధ్యతలు స్వీకరించిన జానకి షర్మిల శుక్రవారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

మళ్లీ అటకెక్కిన అవిశ్వాసం

- హైకోర్టు స్టేతో నిలిచిపోయిన ఖానాపూర్ మున్సిపల్ అవిశ్వాసం
- అధికారులు అవినీతి చేయడంతోనే అవిశ్వాసం నిలిచిపోయే పరిస్థితి వచ్చిందని కౌన్సిలర్ల ఆందోళన
- ఆర్డీవోను అడ్డుకున్న కౌన్సిలర్లు
- ఖానాపూర్ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఉద్రిక్తత



ఆర్డీవో వాహనాన్ని అడ్డుకుంటున్న కౌన్సిలర్లు



కోర్టు స్టే వివరాలను పాలకవర్గానికి వెల్లడిస్తున్న ఆర్డీవో

ఖానాపూర్, జనవరి 5 : ఖానాపూర్ మున్సిపల్ అవిశ్వాసం ప్రక్రియ మళ్లీ అటకెక్కింది. శుక్రవారం జరగాల్సిన అవిశ్వాసం బలనిరూపణ ప్రక్రియపై హైకోర్టు స్టే ఇవ్వడంతో అవిశ్వాసం బల నిరూపణ తాత్కాలికంగా నిలిచిపోయింది. ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన నిర్మల్ ఆర్డీవో రత్నకల్యాణి కోర్టు స్టే విషయాన్ని కౌన్సిలర్లకు తెలియజేశారు. అవిశ్వాసాన్ని నిలిపివేస్తున్నట్లు ఆర్డీవో ప్రకటించడంతో మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఒక్కసారిగా పరిస్థితులు నెలకొన్నాయి. ఎందుకు బలనిరూపణ ప్రక్రియ నిలిచిపోయిందని అవిశ్వాసానికి వ్యతిరేకంగా కోర్టు స్టే ఇచ్చినందుకు కారణం అధికారులేనని ఆరోపిస్తూ కౌన్సిలర్లు ఆర్డీవోను అడ్డుకున్నారు. అధికారులు అవినీతికి పాల్పడి ప్రస్తుత చైర్మన్ అంకం రాజేందర్‌కు అనుకూలంగా వ్యవహరించడంతోనే అవిశ్వాసం నిలిచిపోయే పరిస్థితి వచ్చిందని కౌన్సిలర్లు ఆరోపించారు. ఒక దశలో కౌన్సిలర్లు ఆర్డీవో వాహనాన్ని అడ్డుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఎస్సై లింబాద్రి కౌన్సిలర్లను సముదాయించారు. దీంతో ఆర్డీవో వాహనం మున్సిపల్ కార్యాలయం నుండి వెళ్లిపోయింది.

'కోర్టు తీర్పును గౌరవిస్తూ న్యాయపోరాటం కొనసాగిస్తాం'

అధికారులు చేసిన తప్పిదాలతోనే అవిశ్వాస బల నిరూపణ ప్రక్రియ నిలిచిపోయేలా స్టే వచ్చిందని కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ లీడర్ రాజుర సత్యం ఆరోపించారు. బలనిరూపణ ప్రక్రియ నిలిపి వేస్తున్నట్లు ఆర్డీవో ప్రకటించిన అనంతరం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో కౌన్సిలర్లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చైర్మన్, వైస్ చైర్మన్‌లకు వ్యతిరేకంగా 9 మంది కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టినప్పటికీ ప్రస్తుత మున్సిపల్ చైర్మన్ దొడ్డిదారిన చైర్మన్ పదవిని పట్టుకుని వేలాడడం సరికాదన్నారు. చైర్మన్, వైస్ చైర్మన్‌లపై తమ న్యాయపోరాటం కొనసాగిస్తామని సత్యం పేర్కొన్నారు. అవినీతి అక్రమాలకు పాల్పడిన చైర్మన్‌ను కచ్చితంగా గద్దె దింపుతామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కావలి సంతష్, జన్నారం విజయలక్ష్మి, నాయిని స్రవంతి, పరిమి లత, ఆఫ్రిన్ బేగం, కిషోర్ నాయక్, కరుమ శ్రీనివాస్, పౌజియా బేగం, తదితరులు పాల్గొన్నారు.

ఇథనాల్ ఫ్యాక్టరీ బాధిత రైతులకు అండగా ఉంటా

డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు

నిర్మల్ టౌన్, జనవరి 5 : జిల్లా దిలావర్‌పూర్, గుండంపెల్లి గ్రామాల మధ్య నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీ బాధిత రైతులకు అండగా ఉంటానని డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు అన్నారు. శుక్రవారం నిర్మల్ జిల్లా కేంద్రంలో ఆయనను బాధిత రైతులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఫ్యాక్టరీ నిర్మిస్తే కలిగే నష్టాలను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఇరు గ్రామాల అన్నదాతలు ఎలాంటి ఆందోళన చెందవద్దని, ఇథనాల్ ఫ్యాక్టరీ సమస్యను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని రైతులకు భరోసా ఇచ్చారు.



దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామాల రైతులతో డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు

పది ఫలితాల్లో ప్రతిభ చాటాలి : డీఈవో

నిర్మల్ కల్చరల్, జనవరి 5 : రాబోయే పది పరీక్షల్లో విద్యార్థులు ప్రతిభ చాటాలని డీఈవో రవీందర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం ఆయన జాఫ్రాపూర్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో అమలవుతున్న ఉన్నతి, తొలిమెట్టు కార్యక్రమాలు అమలు తీరు పరిశీలించారు. విద్యార్థులు కష్టపడి చదవాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు తోడిశెట్టి పరమేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ డైరీ ఆవిష్కరణ

నిర్మల్ కల్చరల్, జనవరి 5 : ఎస్టీయూ రూపొందించిన 2024 డైరీని అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ శుక్రవారం ఆవిష్కరించారు. డీఈవో రవీందర్‌రెడ్డి, ఎస్టీయూ నాయకులు భూమన్న యాదవ్, జే. లక్ష్మణ్, జుట్టు గజేందర్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

గుంతల రోడ్డుకు మరమ్మతులు



సొంత ఖర్చుతో గుంతలు పూడ్చి మరమ్మతులు చేయిస్తున్న బీజేపీ నాయకులు

నిర్మల్ రూరల్, జనవరి 5 : సోన్ మండలం పాక్‌పట్ల గ్రామం నుంచి గాంధీనగర్ గ్రామానికి వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారింది. రాకపోకలకు గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారని ఈ విషయాన్ని స్థానికులు బీజేపీ నాయకుల దృష్టికి శుక్రవారం తీసుకెళ్లారు. వెంటనే వారు స్పందించి సొంత ఖర్చులతో రోడ్డుపై ఉన్న గుంతలు పూడ్చి మరమ్మతులు చేయించారు. ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి సహకారంతో త్వరలోనే శాశ్వత పరిష్కారం చేస్తామని బీజేపీ నాయకులు హామీ ఇచ్చారు.

విద్యుత్‌షాక్‌తో మహిళ మృతి

తానూర్, జనవరి 5 : విద్యుత్‌షాక్ తగిలి మహిళ మృతి చెందినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. వివరాల ప్రకారం... మండల కేంద్రానికి చెందిన కేవల్‌బాయి (35) అనే మహిళ గురువారం తన సొంత వ్యవసాయ పొలంలో పనులు చేసేందుకు వెళ్లింది, సాయంత్రం సమయంలో బోరు మోటారు ఆన్‌ఆఫ్ చేసే క్రమంలో విద్యుత్‌షాక్‌కు గురయి అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై సందిప్ సంఘటన స్థలానికి చేరు కొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలు భర్త గౌతం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు. మృతురాలికి ఇద్దరు కుమారులున్నారు.

బాలిక బలవన్మరణం

నర్సాపూర్(జి), జనవరి 5 : మండలంలోని బూర్గుపల్లి (జి) గ్రామంలో మధ్యాహ్నం సమయంలో దూలానికి ఉరివేసుకొని బాలిక మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బూర్గుపల్లి (కె) గ్రామానికి చెందిన జాదవ్‌బాబు తొమ్మిదవ తరగతి చదువుతున్న బాలిక ఇద్దరూ ఒకే వర్గానికి చెందిన వారు. గురువారం తనకిచ్చి పెళ్లి చేయాలని ఆమె తల్లిని బెదిరించాడు. దీనిపై బాలిక తల్లి శుక్రవారం జాదవ్‌బాబును నిల దీయ దంతో బాలిక మన స్థాపానికి గురై ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవీందర్ తెలిపారు.

ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్	ఏషియన్ సత్యం - అమీర్‌పేట్
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి	సినీ ప్లానెట్ - కొంపల్లి
సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట	ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్
ఫోరం మాల్ - కూకట్‌పల్లి	ఏషియన్ రాధిక - కాప్రా
ఆర్.కె. - బంజారాహిల్స్	ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్
ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్	ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి
గలేరియా - పంజాగుట్ట	మిరాజ్ శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్
ఐకాన్ - హైటెక్‌సిటీ	మిరాజ్ సినిమాస్ - బాలానగర్
పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్	మిరాజ్ సినిమాస్ - చందానగర్
పివిఆర్ సినిమాస్ - ముసారాంబాగ్	లక్ష్మీనరసింహ - మియాపూర్
ప్రిస్టన్‌మాల్ - గచ్చిబౌలి	రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి
అట్రియమ్ - గచ్చిబౌలి	జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి
ఎస్2 నోమ - మల్లాపూర్	మూవీటైమ్ - అమీర్‌పేట
జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్	ఎస్.ఎల్.ఎన్ - గచ్చిబౌలి
ఎం.పి మాల్ - కాచిగూడ	టివోలి - సికింద్రాబాద్
జిఎస్ఎమ్ - మదీనగూడ	విజయలక్ష్మి - ఎల్.బి.నగర్
నెక్లెస్ సత్య - కవాడిగూడ	శివగంగ - దిల్‌సుఖ్‌నగర్
అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్	షా షహెన్‌షా - చింతల్
మంజీరామాల్ - కూకట్‌పల్లి	లక్ష్మీకళ సినీప్రైడ్ - మూసాపేట్
సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి	మూవీమ్యాక్స్ - మౌలాలి
మంత్రామాల్ - అత్తాపూర్	జె.పి.సినిమాస్ - చందానగర్
సుధా - శాలిబండ	మరియు
డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్	మీ అభిమాన థియేటర్లలో

లబ్ధిదారులకు గ్యాస్ కనెక్షన్ల అందజేత

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 5: ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు గ్యాస్ కనెక్షన్లు ఉచితంగా అందించడం జరుగుతుందని అదనపు కలెక్టర్ శ్యామలదేవి అన్నారు. శుక్రవారం కలెక్టర్ సమావేశ మందిరంలో అర్హులైన 9 మంది మహిళలకు గ్యాస్ కనెక్షన్లు అందించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రేషన్‌కార్డు కలిగిఉండి ఇప్పటి వరకు గ్యాస్ కనెక్షన్ లేని లబ్ధిదారులకు ఈ పథకం కింద ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు అందుతాయని, అర్హులు తమ దగ్గరలోని గ్యాస్ ఏజెన్సీలలో ఈ పథకం కింద దరఖాస్తులను సమర్పించాలని అన్నారు. ఇందులో డీఎస్‌వో కిరణ్ కుమార్, గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

'రాజకీయంగా అవకాశాలు కల్పించాలి'

మావల, జనవరి 5: ఆదివాసీ పర్ధాన్ సమాజ్‌కు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత కల్పించి రాజకీయంగా గుర్తింపు ఇవ్వాలని అడహక్ కమిటీ సభ్యులు పూసం ఆనంద్‌రావు, అనుసూయలు డిమాండ్ చేశారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తమ అభ్యర్థులకు ఎంపీ టికెట్‌లు కేటాయించాలని కోరారు. శుక్రవారం జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు.


హస్నాపూర్‌లో దరఖాస్తులనుస్వీకరిస్తున్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్


తేజాపూర్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

ప్రజాపాలనలో సమస్యల పరిష్కారం

● ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ ● ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా అభయహస్తం దరఖాస్తుల స్వీకరణ ● పాల్గొన్న అధికారులు

ఉట్నూర్, జనవరి 5: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన గ్రామసభల ద్వారా ప్రజల సమస్యల పరిష్కారానికి వేదిక దొరికిందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. శుక్రవారం ఉట్నూర్ మండలంలోని హస్నాపూర్, ఘన్‌పూర్‌లలో జరిగిన కార్యక్రమాలలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడానికి కృషి చేస్తోందన్నారు. ముందుగా మహాలక్ష్మి పథకం ప్రారంభించి ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణం అందుబాటులోకి తెచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడానికి నిర్వహిస్తున్న ప్రజాపాలన గ్రామసభలో వస్తున్న అర్జీలను పరిశీలించి అర్హులందరికీ న్యాయం చేయడం జరుగుతుందన్నారు. ఇందులో హస్నాపూర్ సర్పంచ్ జాదవ్‌ఉపేందర్, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు. అలాగే, మండలంలోని షాంపూర్‌లో జరిగిన ప్రజాపాలన కార్యక్రమంలో ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు, వైస్ ఎంపీపీ బాలాజి, సర్పంచ్ గుండాల మల్లిక ఆధ్వర్యంలో దరఖాస్తులను స్వీకరించారు.

ఇంద్రవెల్లి: రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు కాకముందే కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలు వంద రోజుల్లో కచ్చితంగా అమలవుతాయని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. శుక్రవారం మండలంలోని కేస్లాపూర్ గ్రామంలో జరిగిన ప్రజా పాలనలో పాల్గొని దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన పేదలకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తోందని అప్పుడే అభివృద్ధి చెందుతారని, దళారులను నమ్మి మోసపోకుండా ప్రతి పేదవాడికి స్వయంగా ప్రభుత్వ పథకం అందించాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం మీ వద్దకు వచ్చి దరఖాస్తులను స్వీకరిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకటరావు, జడ్పీటీసీ పుష్పలతా, నాగోబా ఆలయ కమిటీ చైర్మన మెస్రం తుకారం, ఎంపీటీసీ మడావి భీంరావు, సర్పంచ్ మెస్రం రేణుక నాగనాథ్, నాయకులు ఎండీ మసూద్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి కట్టుబడి ఉంటా : ఎమ్మెల్యే అనిల్

నేరడిగొండ: నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉంటానని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని తేజాపూర్ గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తు ఫారాలను అధికారులతో కలిసి స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. కాగా, తేజాపూర్ నుంచి నేరడిగొండ వెళ్లేందుకు నూతన రోడ్డు నిర్మాణానికి రూ.43లక్షల వ్యయంతో భూమిపూజ చేశారు. ఇందులో ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తలమడుగు: కాంగ్రెస్ పార్టీ మీద నమ్మకంతోనే ప్రజలు ఆదరించి గెలిపించారని జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఉండం, ఖోడద్, గత పది సంవత్సరాలు టీఆర్ఎస్ పార్టీ పరిపాలించినప్పటికీ ఎన్నికలు ఇచ్చిన హామీలను ఒకటి కూడా అమలు పరచలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీలో రెండు అమలు చేయడం జరిగిందన్నారు. ప్రతీఒక్కరికి సంక్షేమ అభివృద్ధి పథకాలను అందించేందుకు ప్రజాపాలన గ్రామసభలు ఏర్పాటు చేసి లబ్దిదారుల నుంచి దరఖాస్తులు తీసుకోవడం జరుగుతుందన్నారు. సంక్షేమ పథకాల లబ్ధి కోసం మధ్య దళారులను ఎవరిని నమ్మవద్దు అన్నారు. కాగా, మండలంలో 28 గ్రామ పంచాయతీలో నిర్వహించిన గ్రామసభల్లో వివిధ పథకాల కోసం దాదాపు 11,650 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఇందులో తహసీల్దార్ రాజమోహన్, ఎంపీడీవో రమాకాంత్, ఎంపీపీ కళ్యాణంలక్ష్మి రాజేశ్వర్, నోడల్ ఆఫీసర్ మహావీర్, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యా వసతులపై తనిఖీలు

ఉట్నూర్, జనవరి 5: ఉట్నూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలో జిల్లాలో కొనసాగుతున్న గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో కొనసాగుతున్న విద్యా, వసతులపై ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఏర్పాటు చేసిన పానెల్ బృందాలు తనిఖీలు నిర్వహిస్తున్నాయి. శుక్రవారం ఉట్నూర్ మండలంలోని లక్కేటిపేట ఆదర్శ ఆశ్రమ పాఠశాలను పీజీహెచ్‌ఎం భోజన్న ఆధ్వర్యంలోని బృందం తనిఖీలు నిర్వహించింది. గిరిజన విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న వసతులతో పాటు ఉపాధ్యాయులు అందిస్తున్న విద్య ఎంత మేరకు సత్ఫలితాలు ఇస్తుందో పరిశీలించడానికి ఐటీడీఏ మానిటరింగ్‌సెల్ అధికారులు గిరిజన సంక్షేమ శాఖ డీడీ ఆదేశాల మేరకు ఏడు బృందాలను ఏర్పాటు చేసి జిల్లాలోని 49 ఆశ్రమ పాఠశాలల్లో తనిఖీలు నిర్వహిస్తుంది. లక్కేటిపేట ఆశ్రమ పాఠశాలను సందర్శించిన బృందం ఉదయం ప్రార్థనతో మొదలు చేసి తరగతి గదుల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకు అందిస్తున్న బోధనలను పరిశీలించారు. తెలుగు, ఇంగ్లీస్, గణితం, ఫిజిక్స్, సోషల్ ఫిజిక్స్ సోషల్ హిందీ సబ్జెక్టుల వారీగా టీచర్లను కేటాయించడంతో తరగతి గదుల్లో వారు టీచర్ల బోధన తీరుతో పాటు విద్యార్థులు తెలుసుకుంటున్న విషయాలను పరిశీలించి విద్యార్థులకు టీచర్ చెప్పిన అంశాలు బోధపడుతున్నాయా? లేదా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ బృందంలో ఉపాధ్యాయులు ఉదారి నారాయణ, లక్ష్మణ్, ప్రకాష్‌విలాస్, శేఖర్, నారాయణ, సంజీవ్, జ్ఞానేశ్వర్, గోవిందరావు, పాఠశాల హెచ్‌ఎం దుర్వ విటల్, డిప్యూటీ వార్డెన్ రాథోడ్‌ప్రకాష్ ఉన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం : ఎమ్మెల్యే

గుడిహత్నూర్, జనవరి 5: క్రీడలు మానసిక ఉల్లాసానికి శారీరక ఆరోగ్యానికి దోహదపడుతాయని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని మాన్కపూర్ గ్రామ యువకుల ఆధ్వర్యంలో నిర్వహించిన కుమ్రంభీం క్రికెట్ టోర్నమెంట్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం మెరుగు పడుతుందని క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీయడంలో ఇటువంటి టోర్నమెంట్‌లు దోహదపడుతాయన్నారు. యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. ప్రజాప్రతినిధులు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

వనభోజనాలు వద్దు..

వసతులు కల్పించండి

- వన భోజనాలను వ్యతిరేకించిన ఆర్‌టీసీ కార్మికులు
- నిధులతో డిపోలో వసతులు మెరుగుపరచాలని విజ్ఞప్తి
- పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీ, డీఏ ఏరియర్స్ చెల్లించాలని డిమాండ్


భైంసాలో డిపో మేనేజర్ అమృతకు వినతిపత్రం అందచేస్తున్న ఆర్‌టీసీ కార్మికులు

భైంసా, జనవరి 5 : టీఎస్ ఆర్‌టీసీ యాజమాన్యం సంస్థలోని కార్మికులందరినీ ఒక చోటకు చేర్చి వారితో మమేకం అవ్వడానికి ఏర్పాటు చేసిన వనభోజన కార్యక్రమాన్ని నిర్మల్ జిల్లా భైంసా బస్సు డిపో కార్మికులు వ్యతిరేకించారు. సంస్థ యాజమాన్యం రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం నుంచి డిపోల వారీగా వన భోజన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందుకు ఒక్కో డిపోకు రూ.75 వేల వరకు నిధులు కేటాయించింది. అయితే నిర్మల్ జిల్లా భైంసా డిపో కార్మికులు సంబంధిత వన భోజనాన్ని వ్యతిరేకరించారు. డిపోలో వసతుల లేమి, సౌకర్యాల కరువుతో అవస్థలు పడుతున్నామని, టిమ్స్ మిషన్స్ సక్రమంగా పనిచేయక కండక్టర్లు ఇబ్బందులు పడుతున్నారని కార్మికులు వెల్లడించారు. ఇలాంటి సందర్భంలో తాము వన భోజనాలు చేయలేమని కార్మికులంతా ముక్తకంఠంతో వ్యతిరేకించారు. సంబంధిత వన భోజనాలకు కేటాయించిన నిధులను భోజనాలకు కాకుండా డిపో పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి, వసతుల కల్పనకు, కొత్త టిమ్స్ మిషన్ల కొనుగోలుకు వెచ్చించాలని సూచించారు. అంతేకాకుండా పెండింగ్‌లోనున్న రెండు పీఆర్‌సీలు, బాండ్ డబ్బులు, డీఏ ఏరియర్స్ చెల్లించి కార్మికుల ఆర్థిక ఇబ్బందులను తొలగించాలని సంస్థ యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. వన భోజనాలను వ్యతిరేకిస్తూ డిపో పరిధిలోని అన్ని విభాగాల కార్మిక ప్రతినిధులు శుక్రవారం కార్మికుల సంతకాల సేకరణను చేపట్టారు. అనంతరం డిపో మేనేజర్ అమృతకు సంబంధిత సంతకాల పత్రాన్ని, వన భోజనాలకు వ్యతిరేకిస్తున్న వినతి పత్రాన్ని అందచేశారు.



తాంసిలో కేజీబీవీ పాఠశాల తనిఖీ

తాంసి, జనవరి 5: మండల కేంద్రంలో ఉన్న కేజీబీవీ పాఠశాలను శుక్రవారం ఎంపీడీవో భూమయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. పదవ తరగతి విద్యార్థులు పరీక్షలకు ఎలా సిద్ధం కావాలో? అవగాహన కల్పించారు ముఖ్యంగా విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదివినప్పుడే మంచి ఫలితాలు సాధిస్తారని ఆయన సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వో సౌజన్య, సిబ్బంది శ్రీవిద్య, సంగీత, పుష్పాలత, రమ, తదితరులు ఉన్నారు.



● భూమిని చదును చేస్తున్న రైతులు (ఫైల్)

● వరినాట్లు వేస్తున్న రైతు కూలీలు(ఫైల్)

రైతుబంధు కోసం.. ఎదురుచూపు!

- జిల్లాలో రైతుబంధు డబ్బుల కోసం 89,765 మంది రైతుల నిరీక్షణ
- యాసంగి సీజన్ సాగుకు ఇప్పటికీ అందని పెట్టుబడి సహాయం
- ఇప్పటి వరకు రెండు ఎకరాలలోపే అందిన సాగు సహాయం
- తమకేమీ తెలియదంటున్న సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు
- నూతన ప్రభుత్వంపై భారీ ఆశలు పెట్టుకున్న అన్నదాతలు
- జిల్లావ్యాప్తంగా లక్షా 64వేల 124 మంది రైతులు కాగా.. ఇప్పటి వరకు 19,563 మంది ఖాతాల్లోనే రైతుబంధు సహాయం జమ



ఆదిలాబాద్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న రైతుబంధు పథకంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. యాసంగి పంటల సాగుకు సమయం మించిపోతున్నా.. ఇంకా పెట్టుబడి సహాయం అందక పోవడంపై అన్నదాతలు ఆందోళనకు గురవుతునారు. ఈసారి అసెంబ్లీ ఎన్నికలతో యాసంగి రైతుబంధుకు బ్రేక్ పడింది. దీంతో ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత రైతుబంధు వస్తుందని అధికార కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. కానీ కొత్త ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు గడుస్తున్నా.. ఇంకా రైతుబంధు రాకపోవడంతో ఎదురుచూపులు తప్పడం లేదు. పెంచిన పెట్టుబడి సహాయం దేవుడెరుగు గానీ.. ఉన్నదాన్నే ఇవ్వాలంటూ రైతులు డిమాండ్ చేస్తున్నా రు. రబీ (యాసంగి) సీజన్ ముగిసిపోతున్నా.. పెట్టుబడి సహాయం అందడం లేదని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో లక్షా 64వేల 124 మంది రైతులు ఉన్నారు. వీరికి రూ.286, 69, 44, 941 కోట్ల నిధులు అవసరమని ప్రభుత్వం గుర్తించింది. ఇందులో లక్షా 9వేల 328 మంది రైతు ఖాతాల వివరాలను ట్రెజరీకి పంపించారు. దీనికి సంబంధించిన రూ.123కోట్ల 09,60,717 కోట్ల రూపాయల నిధులను విడుదల చేశారు. కానీ ఇప్పటి వరకు జిల్లావ్యాప్తంగా 19,563 మంది రైతులకు మాత్రమే రూ.7కోట్ల 89లక్షల 30వేల 543ల నిధులు రైతుల ఖాతాల్లో జమ చేశారు. మిగితా రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదు. ఆ తర్వాత రైతుబందు పథకాన్ని అర్థాంతరంగానే నిలిపి వేశారు. ఇదిగో అదిగో అంటూ కాలం గడుపుతున్నారే తప్ప.. అందాల్సిన నగదు సహాయాన్ని ఇవ్వడం లేదని రైతులు వాపోతున్నారు. వ్యవసాయ శాఖాధికారులను అడిగితే.. తమకేమీ తెలియదంటూ చేతులెత్తేస్తున్నారు. ప్రభుత్వం మారడంతోనే రైతుబంధు పథకానికి అడ్డంకులు ఏర్పడ్డాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అందని పెట్టుబడి సహాయం

జిల్లాలో 89,765 మంది రైతులకు యాసంగి పెట్టుబడి సహాయం అందలేదు. నవంబరు 30న అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగియడంతో డిసెంబరు 3న ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. ఇదే క్రమంలో 9న కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టింది. అయినా రైతుబంధు పథకం కింద పెట్టుబడి సహాయాన్ని అందించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టడం లేదని రైతులు చెబుతున్నా రు. అయితే పెట్టుబడి సహాయం వస్తుందని యాసంగి పంటల సాగుకు సిద్ధమైన అన్నదాతలకు ఇబ్బందులు తప్పడం లేదు. సమయానికి చేతిలో చిల్లిగవ్వ లేక పంటల సాగు ఆలస్యమవుతోంది. సకాలంలోనే పంటలను సాగు చేస్తే ఆశించిన దిగుబడులు వస్తాయని అన్నదాతలు చెబుతున్నారు. యాసంగి సీజన్ ముగిసి పోతున్నా.. రాష్ట్ర ప్రభుత్వం నగదు సహాయాన్ని అందించక పోవడంతో అప్పులు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలకు ముందు డిసెంబరు 9న రైతుబంధును అందిస్తామని చెప్పిన ప్రభుత్వం.. ఆ తర్వాత దాని ఊసే ఎత్తడం లేదంటున్నారు. అధికారంలోకి వస్తే ఎకరాన రూ.15వేలు చెల్లిస్తామని చెప్పినప్పటికీ.. ఇంకా దరఖాస్తుల ప్రక్రియనే కొనసాగిస్తోంది.

రెండు ఎకరాల లోపే..

సరిగ్గా అసెంబ్లీ ఎన్నికలకు మూడు రోజుల ముందు రైతుబంధు పథకం కింద పెట్టుబడి సహాయాన్ని రైతుల ఖాతాల్లో జమ చేయడం ప్రారంభించారు. దీనిపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు వెల్లడంతో అర్థాంతరంగా నిలిపి వేశారు. ఎన్నికలు ముగిసి ప్రభుత్వం ఏర్పడిన.. ఇంకా పెట్టుబడి సహాయం అందడం లేదంటున్నారు. కేవలం రెండు ఎకరాల లోపు భూమిని కలిగి ఉన్న రైతులకు మాత్రమే పెట్టుబడి సహాయాన్ని అందించి చేతులు దులుపుకున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. జిల్లాలో 19,563 మంది రైతులకు గాను రూ.7కోట్ల 89లక్షల 30వేల 543 నిధులను రైతుల ఖాతాల్లో జమ చేశారు. మిగితా రూ.116 కోట్లకు పైగా రైతుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉంది. ప్రభుత్వం మొదట తక్కువ భూమిని కలిగి ఉన్న రైతులకు రైతుబంధు పథకం కింద నగదును జమ చేస్తూ వచ్చింది. ఇలా రెండు ఎకరాలలోపు రైతుల ఖాతాల్లో పెట్టుబడి సహాయాన్ని జమ చేసింది. ప్రభుత్వ సహాయంపై ఎన్నో ఆశలు పెట్టుకుని పంటలను సాగు చేసిన ఫలితమే లేకుండా పోయిందంటున్నారు. గత్యంతరం లేక కొంత మంది రైతులు పెట్టుబడి సహాయం వస్తుందన్న ధీమాతో అప్పులు చేసి మరీ.. పంటల ను సాగు చేశారు. అయినప్పటికీ నగదు చేతికి రాకపోవడంతో దిక్కు లు చూడాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. రైతుబంధు పథకంపై ప్రభుత్వం స్పష్టతను ఇవ్వక పోవడంతో రైతులు అయోమయానికి గురవుతున్నారు.



రైతుబంధు నిధులను వెంటనే విడుదల చేయాలి

: గోరుపాండు మారుతి, రైతు, సిరికొండ మండలం



ప్రభుత్వం రైతుబందు నిధులను వెంటనే విడుదల చేయాలి. గత సర్కారు హయాంలో పెట్టుబడి సహాయం అందిన ప్రస్థుతం పంటల సాగుకు పెట్టుబడి సహాయం అందడం లేదు. యాసంగి పంటల పెట్టుబడి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. నవంబర్ మాసంలోనే అందించాల్సిన పెట్టుబడి సహాయాన్ని జనవరి గడిచి పోతున్న రావడం లేదు. గత్యంతరం లేక అప్పులు చేసి పంటలను సాగు చేస్తున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబందు ఇస్తుందో లేదో అర్థం కావడంలేదు. రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని పెట్టుబడి సహాయాన్ని వెంటనే అందించాలి.

సంక్షిప్త సమాచారం

కొలంగూడలో సికిల్ సెల్ పరీక్షలు

మావల, జనవరి 5: ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకోలి పాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి లో గల కోలంగూడ గ్రామ ప్రజలకు సికిల్ సెల్ రక్త నమూనాల పరీక్షలను శుక్రవారం వైద్య సిబ్బంది చేశారు. ఈ సందర్భంగా వారికి పలు ఆరోగ్య సూచనలు చేశారు. పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఇందులో డాక్టర్ సర్వరాజ్, హెల్త్ నర్సు శ్యామల, ఆరోగ్య పర్యవేక్షకులు బొమ్మెత సుభాష్, ఆరోగ్య కార్యకర్తలు ఈశ్వర్ దేవి, వేణతాయి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాలకు ఆర్టీసీ బస్సు ట్రిప్పుల సంఖ్య పెంపు

తలమడుగు, జనవరి 5: జిల్లాకేంద్రానికి 20 కి.మీ.ల దూరంలో ఉన్న తలమడుగు మండలంలోని పలు మారుమూల గిరిజన గ్రామాలకు ఆర్టీసీ అధికారులు బస్సు సౌకర్యం కల్పించారు. ఉన్న గ్రామాలకు తక్కువ ట్రిపులు ఉండడంతో గిరిజన గ్రామాల ప్రజలు మండలవాసులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి విన్నవించారు. ఈ మేరకు స్పందించిన ఆయన జిల్లా ఆర్టీసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు స్పందించి జిల్లా కేంద్రం నుంచి మండల మీదుగా ఉమ్మడి కోసాయి వరకు ప్రతీరోజు ఆరు ట్రిప్పుల బస్సులను పెంపు చేసి ప్రారంభించారు. దీంతో మండల వాసులు, గిరిజనులు జడ్పీటీసీతో పాటు ఆర్టీసీ అధికారులకు ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

'గంగపుత్రుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా'

బోథ్, జనవరి 5: గంగపుత్ర సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తానని గంగపుత్ర సంఘం జిల్లా డైరెక్టర్ పందిరి పోశెట్టి పేర్కొన్నారు. నూతనంగా జిల్లా డైరెక్టర్‌గా ఎన్నికైన సందర్భంగా ఆయనను సంఘంలోని సభ్యులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. దీనిలో భాగంగా ఆయన మాటాడ్లుతూ గంగపుత్రులు ఎదుర్కొంటున్న సమస్యలన్నీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తామన్నారు. డైరెక్టర్‌గా బోథ్ నుంచి అవకాశం కల్పించినందుకు తన వంతు కృషిగా చేస్తానని ఆయన పేర్కొన్నారు.

శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి : ఎస్‌ఎఫ్‌ఐ

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 5: భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) జిల్లా స్థాయి విద్య వైజ్ఞానిక శిక్షణ తరగతులు ఈ నెల 8, 9వ తేదీల్లో జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సక్కు, ఆత్రం నగేష్‌లు తెలిపారు. ఈ మేరకు జిల్లాకేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. విద్యార్థుల సమస్యల పైపోరాటాలు చేయడమే కాదు విద్యార్థుల్లో శాస్త్రీయ విద్య విధానం సామాజిక స్రోహ ఈ దేశంలో జరుగుతున్న దోపిడీకి వ్యతిరేకంగా నిలబడం కోసం ఎస్ఎఫ్ఐ విద్య వైజ్ఞానిక శిక్షణలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా బీజేపీ ప్రభుత్వం తీసుకు వస్తున్న మతోన్మాద విద్య విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలంటే విద్యార్థులకు శాస్త్రీ, విద్య విధానం ఎంతో అవసరమని వారు పేర్కొన్నారు. జిల్లాలో ఉన్న విద్యావేత్తలు, విద్యార్థులు, మేధావులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఇందులో ఎస్ఎఫ్ఐ నాయకులు సాయికిరణ్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్



పాల్గొన్న అధికారులు, కంప్యూటర్ ఆపరేటర్లు

తప్పులు దొర్లకుండా నమోదు చేయాలి

● కలెక్టర్ రాహుల్‌రాజ్ ● జడ్పీ మీటింగ్ హాల్‌లో కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ ● నేటితో ముగియనున్న 'అభయహస్తం' దరఖాస్తుల స్వీకరణ

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 5: ప్రజాపాలనలో భాగంగా ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తుల వివరాలను ఎలాంటి తప్పులు దొర్లకుండా వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ పీఎస్ అన్నారు. శుక్రవారం జడ్పీ సమావేశ మందిరంలో కంప్యూటర్ ఆపరేటర్లకు ప్రజాపాలన దరఖాస్తుల డాటా నమోదుపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన దరఖాస్తులను సంబంధిత వెబ్‌సైట్‌లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా నమోదు ప్రక్రియ చేపట్టాలని ఆదేశించారు. ఈనెల 6వ తేదీతో ముగియనున్న దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం ఇప్పటికే 95 శాతం పూర్తయ్యిందని, దరఖాస్తుల డేటా నమోదుని ఈ నెల 17 వరకు పూర్తి చేయాలని ఆదేశించారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ధరణి, తదితర డేటాను ఎంట్రీ చేసిన అనుభవం ఉందని ఎలాంటి తప్పులు దొర్లకుండా నమోదు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. అంతేకాకుండా దరఖాస్తులు గల్లంతు కాకుండా పూర్తి జాగ్రత్త వహించి భద్రపరచాలని, నిర్లక్ష్యం వహిస్తే ఆపరేటర్‌తో పాటు సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ డాటా ఆధారంగానే లబ్దిదారులకు సంక్షేమ ఫలాలు అందించడం జరుగుతుందని ఆధార్, రేషన్‌కార్డు, సెల్ నెంబర్లను పూర్తి జాగ్రత్తతో తప్పులు లేకుండా నమోదు చేయాలని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. అంతకుముందు మాస్టర్ ట్రైనర్ వినోద్ పవర్ పాయింట్ ప్రజం టేషన్ ద్వారా డాటాఎంట్రీ నమోదు ప్రక్రియను వివరించి ఆపరేటర్లకు సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఖుష్బుగుప్తా, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, జడ్పీ సీఈవో గణపతి, మున్సిపల్ కమిషనర్ శైలజ, తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు, అధికారులు, కంప్యూటర్ ఆపరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.



ఎస్పీ వాహనం లాగుతున్న పోలీసు అధికారులు, సిబ్బంది



ఎస్పీని గజమాలతో సన్మానిస్తున్న పోలీసు అధికారులు

బదిలీపై వెళ్తున్న ఎస్పీకి ఘన వీడ్కోలు

● వాహనం లాగి వీడ్కోలు పలికిన పోలీసు అధికారులు ● ప్రత్యేకంగా సిబ్బంది విధాయి పరేడ్ ● భావోద్వేగానికి గురైన ఉదయ్‌కుమార్‌రెడ్డి

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 5: బదిలీలు సర్వసాధారణమని జిల్లా ఎస్పీ డి.ఉదయ్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా హెడ్‌క్వాటర్స్‌లో బదిలీ అయిన ఎస్పీ డి.ఉదయ్ కుమార్ రెడ్డికి విధాయిపరేడ్ నిర్వహించి పోలీసుల గౌరవ వందనం, గజమాలతో సత్కరించి వాహనంలో ఎస్పీని హెడ్‌క్వార్టర్స్ గేట్ వరకు జిల్లా పోలీసులు, సిబ్బంది ప్రత్యేకం వాహనం తాడు లాగి వీడ్కొలు పలికారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లాలో చేసిన సేవలు మరువలేనివని, సిబ్బందిని విడిచి పోవడం చాలా బాధగా ఉందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. తన సర్వీసులో 20 సంవత్సరాల పాటు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే సేవలందించడం జరిగిందని అన్నారు. అంతేగాకుండా సిబ్బంది పనితీరు ద్వారా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఎస్పీ స్థాయి వరకు ఎదగడం జరిగిందని తెలపారు. ఆదిలాబాద్ జిల్లాలో రెండు సంవత్సరాల పాటు ప్రశాంతంగా కొనసాగడానికి జిల్లాలో పని చేసిన ప్రతి ఒక్క పోలీసు సిబ్బంది సహకారమేనని సిబ్బంది సేవలను కొనియాడారు. దీనికి ప్రతిఫలంగా దేశంలోనే అత్యంత సురక్షితమైన జిల్లాలో ఆదిలాబాద్ జిల్లా ఐదవ స్థానాన్ని తెలంగాణ రాష్ట్రంలో మొదటి స్థానాన్ని సంపాదించిందని గుర్తు చేశారు. సాధారణ ఎన్నికలను సైతం ఎలాంటి చిన్న అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పూర్తి చేయడం విశేషమని ఆయన తెలిపారు. అదేవిధంగా ముఖ్యంగా డీపీవో సిబ్బంది, సివిల్, ఏఆర్ పోలీసులు చేసిన విధులపై ప్రశంసలను తెలుపుతు సహకరించిన ప్రతీఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ సమయ్‌జాన్‌రావు, డీఎస్పీలు వి.ఉమేందర్, సీహెచ్ శ్రీనివాస్,జి.పోతారం్శ్రీనివాస్, సీహెచ్ నాగేందర్, జిల్లా సీఐలు, ఎస్సైలు, రిజర్వు ఇన్స్‌పెక్టర్లు, రిజర్వ్ సిబ్బంది, డీసీఆర్‌బీ, ఎస్ఐబీ, స్పెషల్ బ్రాంచ్, ఐటీ కోర్, ఫింగర్ ప్రింట్, వింగ్స్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బదిలీపై వెళ్తున్న జిల్లా ఎస్పీ డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి

రాష్ట్రంలో నంబర్ వన్ ఆసుపత్రిగా ఉట్నూర్‌కు గుర్తింపు

ఉట్నూర్, జనవరి 5: భారత ప్రభుత్వం ఏర్పాటు చేసిన నేషనల్ క్వాలిటీ అషురెన్స్ స్టాండర్డ్స్ (ఎన్‌కూఎఎస్) సర్టిఫికెట్‌ను ఉట్నూర్ ఆసుపత్రి అందుకుని.. రాష్ట్రంలోనే నెంబర్ వన్ ఆసుపత్రిగా ఎంపికైంది. భారత ప్రభుత్వ అడిషనల్ సెక్రటరీ నేషనల్ హెల్త్ మిషన్ డైరెక్టర్ ఎల్ఎస్ చాంగ్‌సన్ ఉత్తర్వులు జారీ చేశారని ఉట్నూర్ కమ్యూనిటీ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఉపేందర్ తెలిపారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లో జిల్లాలో ఉన్న ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తొమ్మిది విభాగాల్లో సగటుగా 90 శాతం మార్కులతో రాష్ట్రంలోనే నంబర్ వన్ రావడం చాలా ఆనందంగా ఉందని డా.జాదవ్‌ఉపేందర్ ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ ఆయన మాట్లాడుతూ డా.కపిల్‌రాథోడ్ ఎన్‌క్యూఎఎస్ నోడల్ అధికారిగా పూర్తి బాధ్యతలు చేపట్టి సిబ్బందితో మమేకమై ప్రతీఒక్కరి సహకారంతో మంచి ఫలితాలు సాధించామని, భవిష్యత్‌లో కూడా ఇలాంటి విజయాలు సాధించి ఇక్కడి ప్రజలకు మరింత మెరుగైన నాణ్యమైన వైద్యాన్ని అందించి ప్రజల మన్ననలు పొందుతామన్నారు. ఈ కార్యక్రమంలో రీజినల్ మెడికల్ ఆఫీసర్ డా.మహేందర్, వైద్యులు డా.కపిల్, డా.అరవింద్, డా.రాథోడ్‌రవి, డా.రత్నమాల, డా.పూజిత డా.స్వరూప్ డా.నిఖిష, స్టాఫ్ నర్సులు, ఇతర సిబ్బందిసుభాష్ బోంకంటి, పారా మెడికల్ సిబ్బంది, సెక్యూరిటీ గార్డులు, పారిశుద్ధ్య కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.



ఉట్నూర్‌లోని కమ్యూనిటీ హాస్పిటల్ డాక్టర్లు, సిబ్బంది

పదో తరగతి వార్షిక ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణ సాధించాలి

● జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత

తలమడుగు, జనవరి 5: త్వరలో జరగబోయే పదో తరగతి వార్షిక పరీక్ష ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు విద్యార్థులు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాధికారి ప్రణిత కోరారు. శుక్రవారం మండలంలోని బరంపూర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌ను ఆమె అకస్మీకంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరీక్షల సమయం సమీపిస్తున్నందున విద్యార్థులు సమయాన్ని వృదా చేయకుండా కష్టపడి ఇష్టపడుతు చదవాలని కోరారు. అనంతరం పాఠశాలకు సంబంధించిన రిజిస్టర్‌ను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉన్నతి కార్యక్రమం అమలును పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి అందరు విద్యార్థులు ఉత్తీర్ణులయ్యేలా తగిన ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెక్టోరల్ అధికారి శ్రీకాంత్‌గౌడ్, మండల నోడల్ అధికారి వెంకట్‌రావు, ఇన్‌చార్జి ప్రధాన ఉపాధ్యాయులు వాణి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



బరంపూర్ పాఠశాలలో రిజిస్టర్లను పరిశీలిస్తున్న డీఈవో